# గణితం

ఎ+బి హోల్ స్క్వేర్ ఈజ్ ఈక్వల్ టూ ఎస్క్వేర్+ బిస్క్వేర్+టు ఎ బి అనేది గొప్ప సిద్ధాంతమే కానీ

సిద్ధాంతాలకి అందని నిజాలు కూడా తప్పకుండా వుంటాయని ఋజువు చెయ్యడం లాగా, అతని స్కూటర్ మీదనించి దిగింది రాధ - సందేహం లేదు రాధే! రాధని అతనితో ఎప్పుడూ ఊహించలేదు తను - నమ్మలేకపోతున్నా, ఆమె రాధే-! ఈ హాస్పిటల్‌కి ఆమె రావడానికి కారణం ఆమెని చూడగానే తెలిసిపోతోంది.

తులసి మళ్ళీ వాళ్ళిద్దర్నీ చూసింది - అతను మధు - ఆమె రాధ - అది నిజం - మధు తన భార్య రాధని చెకప్‌కి డాక్టర్ సరోజిని మెటర్నిటీ లో చేర్చి వచ్చేడు -సందేహం లేదు - రాధ నిండుగా వుంది - కళ్ళల్లో సంతృప్తి కాంతి కొట్టొచ్చినట్టు కనపడుతోంది - తన కర్థంకానిది వీళ్ళిద్దరికీ ఎలా సంబంధం కుదిరింది అనేదే!

"హలో తులసీ-" అంది రాధ- భుజం మీద చెయ్యివేసి.

"హలో! రాధా- బాగున్నావా? కంగ్రాట్స్ - తల్లికాబోతున్నందుకు - నిన్ను స్కూటర్ మీద తెచ్చింది మధూ కదూ!" అంది.

'అవును! మధూ నేనూ పెళ్ళి చేసుకున్నాం - ఏడాదయింది - నువ్వీ వూళ్ళో వున్నావని తెలీదు-' అంది రాధ.

"మా ఆయనకి ఇక్కడ ఉద్యోగం- నేనూ ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాను-"

"నీకు పెళ్ళయినట్లు తెలీదు-" అంది రాధ.

ఇంకా కాలేదనుకుంటోంది కాబోలు - అలా అనుకోడంలో తప్పేం లేదు - నిజంగా అలా అనుకుంటూందో - వెక్కిరించడానికి అన్నదో తెలీలేదు -

"నిరుడు అయింది - నీ ఎడ్రెస్ తెలీక కార్డు పంపలేదు - నీ పెళ్ళయినట్లు నాకు తెలీదుగా!" అంది తులసి!

"నా పెళ్ళికి కార్డు వేయించలేదు- ఓ పదిమంది ఫ్రెండ్స్‌తో రిజిస్ట్రార్ ఆఫీసుకి వెళ్ళి పెళ్ళి అయిందనిపించాం- ఎందుకంత ఖర్చని-"

"దట్స్ వెరీ ఇంటరెస్టింగ్ - ఇక్కడేం చేస్తున్నావ్ నువు -"

"ప్రస్తుతం కడుపులో పిల్లని మోస్తున్నాను - మధు ఫొటో స్టూడియో ఒకటి ప్రారంభించాడిక్కడ - అతనికి సాయం చేస్తుంటాను - రాకూడదూ మా యింటికి పోదాం-' అంది రాధ.

పిలవగానే ఎక్కడికీ వెళ్ళకూడదు - కొంచెం బెట్టు చెయ్యాలనేది చిన్నప్పటి నుంచీ నేర్చుకున్న జ్ఞానం - మధూ, రాధా ఎలా వుంటున్నారో చూడాలన్నది. ఇప్పటి కుతూహలం - రాధలోపలికి వెళ్ళి చెకప్ చేయించుకుని వచ్చింది.

"నీక్కూడా ఇలాంటి జబ్బేనా?" అంది.

"కాదులే చిన్న సుస్తీ-" అని నవ్వి లోపలికి వెళ్ళింది - తిరిగి వచ్చేవరకూ అక్కడే వుంది రాధ.

'మా ఇల్లు ఇక్కడికి చాలా దగ్గర నడిచిపోవచ్చు" అంది. "కారు తెచ్చాను పద -" అంది తులసి.

" నీకు కారు వుండే వుండాలి - మర్చిపోయాను పద" అంది రాధ

ఇది కూడా వెక్కిరింపేననిపించింది. ఫొటో స్టూడియో ముందు కారు ఆపింది.

ఇల్లూ, ఫొటో స్టూడియో కలిసే వున్నాయి. మూడు గదులు స్టూడియో - రెండు గదులు ఇల్లు. ఇల్లు నిరాడంబరంగా - చాలా సాదాగా వుంది. ఒక గదిలో మంచాలు, పుస్తకాలు. ఒక గదిలో వంట సామాను, మళ్ళీ పుస్తకాలు. స్టూడియోలో కూడా మళ్ళీ మళ్ళీ పుస్తకాలు - మంచాల గదిలోనే టి.వి. టేప్ రికార్డర్.

రాధ చల్లని నిమ్మరసం యిచ్చింది.

"మీ ఆయన పేరేమిటి? ఏం చేస్తాడు అన్నీ చెప్పు -" అంది.

మధు వచ్చేడు- "ఓ! తులసీ - ఏమి విస్మయానందం!" అన్నాడు.

"నా ప్రశ్నకి జవాబు చెప్పలేదు-" అంది రాధ.

"ఏం ప్రశ్న వేశావు?" మధు అడిగేడు.

"వాళ్ళాయన ఏం చేస్తాడు అని?"

"ఓ! అదా! తులసి కన్న అన్ని విధాల ఎక్కువైనవాడు! ఆమె కన్న పొడుగు - ఆమె కన్న అందగాడు - ఆమెకన్న ఓ మెట్టు పై ఉద్యోగంలో వున్నవాడు - ఆస్తికలవాడు - ఆమెకన్న ఎక్కువ చదివినవాడు అయివుంటాడు - బహుశా ఏ కంపెనీకో మేనేజింగ్ డైరెక్టరో - ఏ గవర్నమెంటు సంస్థకో డైరెక్టరో -"

మధుని చెంప పగలగొట్టాలన్నంత కోపం వచ్చింది తులసికి.

"అవును - నువ్వు చెప్పిందంతా నిజం - అతని పేరు ప్రభాకర్ -" అంది తమాయించుకుని.

"నేనెప్పుడూ నిజమే చెబుతాను తులసీ - నీ సిద్ధాంతం ప్రకారం అది అంతే అయివుండాలి-'

సరస్సులో రాయి విసిరేడు. బహుశా అతనికి చాలా ఆనందం కలిగి వుండొచ్చు - తనని పుల్లతో పొడిచినందుకు -గురిచూసి బాణం వేసినందుకు.

తులసి లేచింది - ఇంటికి వచ్చింది - దాహంగా అనిపించి మంచినీళ్ళు తాగింది - వంట్లో బాగాలేని తనం ఎక్కువైనట్లు అనిపించింది. చాలా కష్టపడి ఎంతో డబ్బు వెచ్చించి, ఎంతో కాలంగా నిర్మించుకున్న సౌధం, అందం లేక వెల వెలపోయినట్లు అనిపించింది.

-ఖరీదైనదేగాని సుందరమైనది కాని హర్మ్యం శూన్యంగాఅనిపించింది. రెండు రెళ్ళు నాలుగు-అయిదు మూళ్ళు పదిహేను లాగా అన్నీ ఒక పద్ధతి ప్రకారం సాగుతోన్న జీవితంలో, ఈ రోజు ఏదో 'అపద్ధతి' ప్రవేశించిం దేమోనని పిస్తోంది.

తననుకున్నది నిజంగా పద్ధతి కాదేమో ననే సందేహం కూడా కలుగుతోంది- అంకెలన్నీ కాళ్ళూ చేతులూ విరగగొట్టుకుని గాలిలో తేలిపోతున్నాయి. సిద్ధాంతాలు విరిగిపోతున్నాయి- 'టూఏబి' ఒక చోటికి, 'బిస్క్వేర్' ఇంకొకచోటికీ ఎగిరిపోతున్నాయి - ఎస్క్వేర్ మంచం కిందికీ - బి స్క్వేర్ ఇంకెక్కడికో పారిపోతున్నాయి.

ఎయిర్ కండిషనర్ వేసి మంచం మీద పడుకుని కళ్ళు మూసుకుంది తులసి.

ఫోన్ మోగింది - అవతల ప్రభాకర్- తనీవేళ సెలవు పెట్టి ఇంట్లో వుంటున్నట్లు అతనికి తెలుసు.

"సాయంత్రం మా జిడ్డుగాణ్ణిభోజనానికి పిలుస్తున్నాను - ఏమైనా కావాలంటే తెప్పించుకో -ప్యూన్ ని పంపుతాను - " అన్నాడు.

'జిడ్డుగాడు' అంటే అతని కన్నా ఓమెట్టుపైనున్న కృష్ణమూర్తి - హెడ్ ఆఫీసు నించి వచ్చాడు - అతనితో ఏమైనా అవసరం రావచ్చునని అతన్ని భోజనానికి పిలుస్తాడు ప్రభాకర్

- తనకి వంట్లో బాగాలేదని తెలుసు - 'పిలవనా?' అని అడగదు. పిలుస్తున్నానని చెబుతాడు. రెండవ మాటకు అవకాశం ఇవ్వడు. రాబోయే ప్రమోషన్‌కు ఇలాంటి భోజనాలు కొన్ని. తనకి ఎందుకో అసలు నచ్చవు - ఈ వ్యాపార స్నేహాలు, వ్యాపార భోజనాలు.

రాధ తనని ఇంటికి ఎందుకు తీసుకెళ్ళినట్లు??

"ఇదిగో చూడు! నువ్వు చెయ్యలేని పని నేను చేశాను - సమస్త సంపదలు, సౌఖ్యాలు కాలిగోటితో తన్నేసి బ్రతుకులో నిజమైన సుఖం అంటే ఏమిటో అర్థం చేసుకున్నాను-" అని చెప్పడానికా? "నువ్వు అక్కర్లేదని విసిరి వేసిన రాయిని సానపెట్టి అందులో వున్న నిజమైన వజ్రాన్ని వెలికి తీశాను చూడవే మూర్ఖులారా" అని వెక్కిరించడానికా?

"మాది ప్రేమ వివాహం - మేం చూడు ఎంత హాయిగా వున్నామో!' అని చూపించడానికా?

అవును, రాధకి అన్నీ తెలుసు - అస్తమానూ చెట్లకీ పుట్లకీ ఛాయా చిత్రాలు తీసేవాడు పెళ్లానికి అన్నం పెడతాడా? నీ సంపాదన చూసి నీ వెంట పడ్డాడేగానీ నీకన్న చదువు తక్కువ, నీకన్న అందం తక్కువ, నీకన్న పొడుగు కూడా లేడు - ఆస్తిలేదు - ప్రభుత్వోద్యోగం లేదు - ఇవి నిజం ప్రేమలా ? ఇదుత్త ఇన్‌ఫాచ్యుఏషన్ - నిజం - ఇవి ప్రేమలు కావు - వయసులో పుట్టే సహజమైన ఆకర్షణలకి రోమాంటిక్ రూపాలు - స్త్రీ పురుషుల మధ్య వుండేది లైంగిక ఆకర్షణే గానీ ప్రేమకాదు - పెళ్ళయిన రెండోనాటికే తెలిసిపోతుంది - కావాలంటే చూడు ఎన్ని ఉదాహరణలో - మొన్న మొన్న విడాకులు తీసుకున్న వైదేహి - భర్త ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్‌కి బలైపోయి కొనప్రాణాలతో పుట్టింటికి వచ్చింది - ప్రేమ, ప్రేమ అంటూ తనకన్నా అన్నింట్లో తక్కువైన వాణ్ణి పెళ్ళి చేసుకున్న సరస్వతి ఆత్మహత్య చేసుకుంది - ఇంకో సరోజినికి హిస్టీరియా వచ్చింది. -మరో దమయంతి రోగిష్టిమారిదైంది - కోకొల్లలు - ఉదాహరణలు - జీవితానికి రోమాంటిక్ టచ్ మంచిదే - కానీ దాన్ని మించింది వాస్తవికత - స్వభావాలు - అవి ఒకదానితో ఒకటి సర్దుకు పోవడం - ఎంత కాదన్నా పురుషుడు - స్త్రీ ఆధిక్యతని ఏరంగంలోనూ సహించడు. అందులోనూ భార్య తనకన్నా అధికురాలంటే అసలే భరించలేడు- భార్యని భార్యలాగా నే చూస్తాడు - హింసిస్తాడు - ఈ ప్రేమలు అర్థం లేనివి - వుత్తుత్తి ఆకర్షణలు - వయస్సుపోయే వెర్రి పోకడలు - " లోకం చేసిన జ్ఞానబోధ ముందు తలవొగ్గింది తులసి, అని రాధకి తెలుసు - అందుకే రాధ ఇప్పుడు తనని ఇంటికి తీసుకువెళ్ళింది.

ప్రభాకర్ పంపిన ప్యూన్ వచ్చి అమ్మగారు చెప్పిన జాబితా పుచ్చుకుని వెళ్ళేడు. ఆడంబరాలు, అట్టహాసాలు ప్రభాకర్ కి చాలా యిష్టం. కృష్ణమూర్తిలాంటి ఒక మనిషిని పిలిచినా, యధావిధిగా అన్నీ అమర్చాలి. "ఏ మనిషితో ఎప్పుడు అవసరం వస్తుందో - ఇదంతా ఇన్వెస్ట్‌మెంట్, తులసీ!" అంటాడు.

అతనికి ఇన్వెస్ట్‌మెంట్ అంటే చాలా ఇష్టం. ఆమాట అంటే కూడా చాలా యిష్టం.

"ఆఫీసులు ఇంత దగ్గర్లో పెట్టుకుని మనకి కారెందుకు" అంది తులసి- అతను కారు కొన్నప్పుడు.

"ఇదొక ఇన్వెస్ట్‌మెంట్- కారు వుంటే కారు ఎలవెన్సు వస్తుంది - కారు ఇంట్లో పెట్టుకుని స్కూటర్ మీద వెళ్ళొచ్చు - పైగా మన అప్పు తీరేనాటికి కార్ల ధర పెరుగుతుంది - మన డబ్బు మనకొస్తుంది . ఇదంతా సేవింగే !-" అంటాడు. అతని అంచనాలు - లెక్కలు తులసికి చాలా వింతగా వుంటాయి.

కృష్ణమూర్తి భోజనానికి వచ్చాడు తులసి లాంటి భార్యని పొందిన ప్రభాకర్ అదృష్టాన్ని వేనోళ్ళ పొగిడాడు. అందం, మంచి ఉద్యోగం, - చెప్పిన మాటవినే గుణం అన్నీ వున్న అమ్మాయి దొరకడం - నిజంగా చాలా అరుదు - ఇన్నాళ్ళు పెళ్ళి చేసుకోకుండా ఆగినందుకు తగ్గ ఫలితం లభించిందన్నాడు.

అవును! తనకీ సంబంధం కుదిరినప్పుడు చాలా మంది ఆ మాటే అన్నారు. మగవాడు అందంగా వుండడం చాలా గొప్ప అన్నారు. ఇంత మంచి ఉద్యోగం వుండడం - అంతకన్నా అన్నివిధాల ఎక్కువ అయిన వాడు దొరకడం నిజంగా చాలా గొప్ప అన్నారు - ఇంతకాలం ముప్పై ఒక్క సంవత్సరాలు పెళ్ళి చేసుకోకుండా వున్నా - నిరీక్షణకి ఫలితం దక్కిందన్నారు. తులసికి నవ్వొచ్చింది - ఇంతకాలం తను ప్రభాకర్ కోసం నిరీక్షించిందా ? లేదు -

ఆమాటకొస్తే - తన జీవితంలో తీసుకోబడిన నిర్ణయాలలో తన ప్రమేయం ఏం వుందనీ ? బి.ఏ. చదువుతున్నప్పటి నుంచీ సంబంధాల వేట సాగింది. అక్క పెళ్ళికి అయిన అప్పు దృష్టిలో పెట్టుకుని నాన్న తన పెళ్ళికి కొంచెం తాత్సారం చేసేడు. బి.ఏ. కాగానే తనకి ఎం.ఏలో సీటొచ్చింది - "ఊర్కే ఇంట్లో వుండి ఏ చేస్తుందీ వెళ్ళమను యూనివర్సిటీకి - " అన్నారు పెద్దలు . అదీ యూనివర్సిటీ వూళ్ళోనే వుంది కనుక. ఎంఏ. చదువుతున్నప్పుడు పెళ్ళికొడుకుల వేట సాగింది. ఎం.ఏ. అమ్మాయికి గ్రాడ్యుయేట్‌ని చెయ్యం కదా ? అందుకని ఆమెకన్నా విద్యాధికుడి కోసం వేట. ఎం.ఏ. అయిపోయింది. విద్యాధికులు దొరక్కాదు - వాళ్ళు అడిగిన కట్నం చూసి జడుసుకుని.

అదేం అదృష్టమో, తులసికి ఉద్యోగం కూడా వచ్చింది. తులసి అందానికి, తులసి ఉద్యోగానికి తగ్గవాడు, ఎక్కువ కట్నం ఆడక్కుండా వుండేవాడు దొరకడానికి యింత కాలం పట్టింది. ఇప్పుడేం మరి, తులసి కట్నం యివ్వలేదా ? అంటే - యిచ్చింది - ఆమె ఏడెనిమిదేళ్ళుగా తన జీతం అంతా దాచి,ప్రభాకర్ అందానికి, ప్రభాకర్ ఉద్యోగానికీ - తగ్గట్టుగానే కట్నం యిచ్చింది. - అయినప్పటికీ, తులసి అర్హతలు చూసి కట్నంలో కొంత రాయితీ యిచ్చినట్లు అంటూ వుంటారు అతని తల్లి తండ్రులు - అతను కూడా.

తులసి జీవితంలో హాయిగా స్థిరపడిందని; అమెకిక పెళ్ళి కాదేమోనని బాధపడిపోయిన లోకం ఆనందించింది. నిదానమే ప్రదానం అనే సిద్ధాంతం తులసి పట్ల ఎలా ఋజువైందో పదిమందికీ తెలియజెప్పి ఆనందించింది.

"నేనే చాలా పొరపాటు చేశానోయ్ - నాలుగు లక్షలు కట్నం వచ్చిందని ఆశపడి మేనమామ కూతుర్ని చేసేసుకున్నాను - అందులో రెండు లక్షలు మా అమ్మా నాన్న కొట్టేశారు. ఒక లక్ష మా ఆవిడ బంగారం క్రింద అయింది. తీరా చేస్తే నాకొచ్చింది లక్ష - నీలా ఉద్యోగం చేసే భార్య వుంటే రిటైరయ్యేనాటికి ఎన్ని లక్షలవుతాయో చూడు ! నీది నిజమైన ప్లాను. పైగా మీ ఆవిడది సురక్షితమైన, టెన్షన్లు లేని ఉద్యోగం. యు ఆర్ రియల్లీ ప్రాగ్మటిక్. నీ తెలివికి అభినందిస్తున్నానోయ్ -"

జిడ్డు స్టేటుమెంటుని ఏ మాత్రం ఖండించకుండా నవ్వి ఊరుకున్నాడు ప్రభాకర్. తులసికి బాధగా అనిపించింది.

పెళ్ళి చూపులతోనూ, పేరయ్యల తోనూ విసిగి పోయాక తులసి తండ్రి ఆదివారం వివాహ సంబంధాల ప్రకటల్ని జాగ్రత్తగా పరిశీలించడం మొదలు పెట్టేడు. అలా చూడగా - "ముప్పైలోపుఉద్యోగస్తురాలైన అమ్మాయి కావలెను - యువకుని ఉద్యోగం ఫలానా - జీతం ఫలానా - " అనే సలక్షణమైన సంబంధం ఒకటి కంటపడింది. - ఈ మధ్యన వస్తున్న సంబంధాలలో తులసికన్న ఒకటి రెండేళ్ళు తక్కువ వయస్సున్న పెళ్ళికొడుకులు వస్తున్నారు,. వెంటనే ఓ దరఖాస్తు వ్రాసిపడేశాడాయన. పదిరోజుల్లో ఫలానా ఊళ్ళో ఫలానా హోటల్లో ఫలానా టైంకి అమ్మాయితో సహా తల్లి తండ్రులను హాజరుకమ్మని పిలుపొచ్చింది. పుట్టిన తేదీ. సర్టిఫికెట్లు, పతకాలు, ప్రయిజుల తాలూకు ఫోటోలతో సహా హాజరైపోయారు - అబ్బాయి తల్లి తండ్రుల ఎదుట.

థాంక్ గాడ్ అమ్మాయి బాగుంది ! పర్మనెంటు అండ్ డీసెంట్ జాబ్ - ట్రాన్సఫర్ బల్ - అమ్మాయి మర్యాదస్తురాలే!

థాంక్ గాడ్ - అబ్బాయి బానే పున్నాడు ఎత్తుగా వున్నాడు - ఎంత మంచి ఉద్యోగం- మర్యాదగానే కన్పించాడు - జాతకాలు కలవక చస్తాయా ? కలవబట్టే కదా - నీ ప్రకటన చూసి దరఖాస్తు వెయ్యడం జరిగింది - మేం మీ సంబంధం ఏరడం జరిగింది - మేం నమ్మం సార్ జాతకాలు - పిల్ల నచ్చకపోతే మాత్రం జాతకం కుదరలేదంటాం - అంతే ! మేమూ అంతేనండీ - అడిగిన కట్నం యివ్వలేకపోతే అబ్బాయి జాతకం సరిపోలేదంటాం.

అబ్బాయినీ అమ్మాయినీ మాట్లాడు కోమనండి !

ఏం వున్నాయి మాట్లాడుకోవడానికి ! ఊహలు కల బోసుకోవడాలూ - అభిప్రాయాలు తెలుసుకోవడాలూ - అభిరుచులు కనుక్కోవడాలూ కావు - అందులోనూ అంకెలూ -

అంచనాలే - "కట్నం కొంచెం ఎక్కువగానే అడుగుతున్నారు - " నాన్న. "ఇచ్చెయ్యండి - దాని దబ్బేవున్నది గదా - మనం కాస్త వేద్దాం - బంగారంలాంటి సంబంధం-" అమ్మ. బ్యాంక్ ప్యాస్ బుక్ లన్నీ పోగేశారు. సరిపోయింది . అమ్మయ్య! మేళాలు మ్రోగాయి ఫలానా వారింట్లో.

"తక్కిన ఆడపిల్లలకెలాగో పెళ్ళి చేశాడు గానీ ' ఈ పిల్ల కే కష్టం అయింది పాపం - అయినా అంతలేసి చదువులూ - ఉద్యోగాలూ వుంటే ఆడపిల్లలకి పెళ్ళిళ్ళు కావండీ - "

"పోన్లే పాపం - తులసి అందరిలాంటిదీ కాదు - చాలా మంచి పిల్ల! ఏదో ఆ ఫోటోలు తీసే అబ్బాయితో స్నేహం చేసింది గానీ - మళ్ళీ పెద్ద వాళ్ళ మాట వినిమానేసింది - చెబితే వినే పిల్లే - చాలా మంచిది -" అని లోకం ఆమెకి శాలువ కప్పి సన్మానించింది.

"మధు తీసిన ఫోటోకి ఫస్ట్ ప్రయిజ్ వచ్చిందటమ్మా - ఏదో దిన పత్రికలో ఉద్యోగం కూడా వచ్చిందట-"" అన్నాడు తులసి తమ్ముడు.

"ఏం పత్రికలో లేరా - ఆ ఉద్యోగాలు శాశ్వతం కావు-" అని చప్పరించేసింది తులసి తల్లి.

"ఇప్పుడు మనకేం అమ్మా - మన తులసికి పెళ్ళయింది కదా! అతనికి ఉద్యోగం వచ్చిందని నేను సంతోషంతో చెప్పానంతే - " అన్నాడతను.

తులసి కూడా సంతోషించింది.

తులసి తన పెళ్ళికి కూడా సంతోషించింది. అవును మగ వాళ్ళకి ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సు వుంటే కష్టం - భార్యల్ని అనేక రకాలుగా బాధ పెట్టి పైశాచికానందం పొందుతారు. పురుషాధిక్యత ఈ సమాజంలో ఇంకా కొన్ని శతాబ్దాలు పరిరక్షింపబడుతుంది. దానికి ఎవరూ ఏం చెయ్యలేరు. సర్దుకు పోవలసిందే. ప్రభాకర్ మంచివాడే ! మొదటి రాత్రే అతడు తన పథకాలన్నీ భార్యకి చెప్పేడు. ఇప్పుడే ఇల్లు కొనుక్కుంటే మంచిది - లోన్ త్వరగా తీర్చవచ్చు - ఒక జీతం యిద్దరికీ హాయిగా చాలు. అందుకని తులసి పేరున అతను లోన్ తీసుకుంటాడు. ఆమె జీతం లోన్‌కి కడుతుంది. ఇల్లు ఆమె పేరునే వుంటుంది. తను కారు లోన్ తీసుకుంటాడు. దాన్ని ఎలవెన్సుల్లో సర్దుతాడు. ఇద్దరు మనుషులకి ఒక జీతం కూడా ఎక్కువే

"మా అల్లుడికి ముందు చూపు జాస్తి -" అని అమ్మ మురిసిపోతుంది. ఇదంతా చెబితే అనుకుంది తులసి.

కట్నం డబ్బులో కొంత కట్టి ఫ్లాట్ కొనేశాడు ప్రభాకర్, లోన్ తీసుకుని. ఇప్పుడు తులసి జీతం అంతా అప్పులకే పోతుంది. అది వరకులా ఓ చౌరాసియా క్యాసెట్ కొనుక్కోవాలన్నా, తమ్ముడికీ చెల్లెలికీ ఏదైనా కొనాలన్నా చేతిలో అసలు డబ్బుండడం లేదు. ప్రభాకర్ జీవన స్థాయి మాత్రం ఏమీ తగ్గలేదు. "ఇల్లునీదే గదోయ్-"అని మురిపిస్తాడు. తులసికి సంగీతం ప్రాణం తమ్ముడికీ - చెల్లికీ కూడా అంతే ! అందులోనూ ఇన్‌స్ట్రుమెంటల్ అంటే మరీ యిష్టం.

ముప్పైయ్యో పడిలో ప్రవేశించడం అంటే వొళ్ళు రాకుండా కాపాడుకోడం - జుత్తురాలకుండా జాగ్రత్త పడ్డం - కళ్ళ క్రింద నల్లపడకుండా చూసుకోవడం -ముప్పై అయినా యిరవై నాలుగులా కనపడడానికి ప్రయత్నించకపోతే పెళ్ళి కుదరదేమోననే బాధ, ఇన్ని కష్టాలున్నా - సాయంత్రం ఇంటి కొచ్చేసరికి కాఫీ తో ఎదురయ్యే అమ్మ.

ఎనిమిదిన్నరకి ఇంటిల్లిపాదీ డైనింగ్ టేబిల్ ముందరపోగవడం. నాన్నగార్ని ఆటపట్టించడానికి తమ్ముడు "వుయ్ డిన్ట్ స్టార్ట్ దఫైర్" అనే బిల్లీ జోయెల్ పాటని పెద్ద వాల్యూంలో పెట్టడం - ఆయన పాశ్చాత్య సంగీతాన్ని తిట్టడం - వాడు ఆ పాటకి అర్థం చెప్పి మెచ్చేసుకోవడం - ఆయన మళ్ళీ తిట్టడం - తరువాత వాడు ఆయనకి సంగీతం మెచ్చుకునే చెవి లేదని అనడం - అమ్మ హరి ప్రసాద్ చౌరాసియా క్యాసెట్ వెయ్యడంతో - ఆ గొడవ సద్దుమణగడం - తమ్ముడి చతుర్లు - చెల్లెలి కబుర్లు – నవ్వులు - నవ్వులు - "పెళ్ళికాలేదు పాపం - " అనే లోకం బాధని తన బాధగా చేసుకుందే గానీ - నిజంగా పెళ్ళి కాలేదనే బాధ తనకి లేదేమో - అమ్మతో అంజద్ ఆలీఖాన్ నీ తమ్ముడితో రాడ్‌స్టీవర్ట్‌నీ చెల్లిలితో జానకినీ విని ఆనందించేది - సాయంత్రం మొదలు రాత్రి పదకొండు వరకూ ఇల్లంతా సంగీత మాధుర్యమే కదా! ప్రభాకర్ కి 'చెవి' అసలు లేదు. అతను టేప్ రికార్డర్ ని వెంటనే కట్టేసి వచ్చి టీ.వీ. ముందు కూర్చుంటాడు.

జిడ్డుని పంపించి, పడక గదిలోకి వచ్చాడతను.

"వెధవ - మహా ఆనందించేడు మన భోజనానికి - నిన్ను చూసి ఒకటే ఏడుపు - అసూయాపరుడు - పోన్లే పాపం - వీడు మా బాస్ కి కుడి భుజం - మన ప్రమోషన్ కి సాయం చేస్తాడు -" అన్నాడు పడుకుంటూ.

తులసి మాట్లాడలేదు - ఇలాంటి వక్కాణింపులకి బదులు చెప్పడానికి ఏం వుంటుంది గనుక ! ప్రభాకర్ చాలా ఆనందంగా వున్నాడు. ఆమె నడుము చుట్టూ చెయ్యి వేసేడు.

"నాకు వంట్లో బాగాలేదు - " అంది తులసి.

"ఏమైందంటా" అన్నాడు.

పొద్దున చెప్పింది - తనే కారిచ్చి హస్పిటల్‌కి వెళ్ళమన్నాడు. మళ్ళీ "ఏమైందిటా-" అంటున్నాడు.

మళ్ళీ చెప్పింది.

'ముప్పై ఒకటన్నావుగానీ, యాభై ఒకటేమోనని నా అనుమానం -" అన్నాడు అటు తిరుగుతూ.

అతని హాస్యం - అసహ్యంగా వుంది - వాంతి వచ్చేలా వుండి, రాకుండా వుంటే ఎలా వుంటుందో అలా వుంది.

తనకీ. మధుకీ మధ్య సంబంధాన్ని 'ఇన్ ఫ్యాచ్యుయేషన్'' అని సిద్ధాంతీకరించిన లోకాన్ని, తనకీ ప్రభాకర్ కీ వున్న సంబంధాన్ని గురించి ఏమంటుందో అడగాలి ? బహుశా భార్యా భర్తల మధ్య సహజంగా వుండే సంబంధం అంటుందేమో! ఈ సంబంధానికి రోమాంటిక్ టచ్ అనవసరం అంటుంది- జీవితంలోనేభావుకత అవసరం లేదు వాస్తవికత కావాలంటుంది.

"ఇదంతా రాధ చేసిందే - ఈ పరికారాలన్నీ కొనడం స్టుడియో ప్రారంభించడం - నాదేం లేదు - 'అన్నాడు మధు.

" నాదేం వుందోయ్! నాదగ్గర డబ్బుంది - అతని దగ్గర కళ వుంది - ఈ రెండింటికీ పరస్పరావసరం వుందని తెలియ జెప్పానంతే -'' అంది రాధ.

రాధ డబ్బుతో పైకొచ్చిన మధుకి ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ రాకుండా వుంటుందా ! ఆమెని హింసిస్తాడా ? ఆమె అతనికి విడాకులిచ్చి వెళ్ళిపోతుందా? ఆత్మహత్య చేసుకుంటుందా? రోగిష్ఠిమారిదౌతుందా?

అది లోకం సిద్ధాంతం - అదేమో తనకి తెలీదుగానీ తనూ ప్రభాకర్ మాత్రం విడిపోరు. ఎందుకంటే తమ జీవితాలు పద్ధతి ప్రకారం నడుస్తాయి. అంచనాల ప్రకారం సాగుతాయి అంకెల మీద - నల్లేరు మీద బండిలా నడిచి పోతాయి.

ప్రభాకర్ హాయిగా గురక పెట్టి నిద్రపోతున్నాడు. అనుకున్న దాన్ని అంచనాల ప్రకారం అందుకోవడమే తెలుసు. అసంతృప్తి ఎరగడు. అక్కర్లేని విషయాల జోలికి వెళ్ళడు. కూడికలతో తీసివేతలతో హడావుడిగా వుంటాడు. తనకి నిద్ర రావడంలేదు. కళ్ళు మూసుకుంటే అంకెలు దయ్యం వేషాలతో మీద మీదకు వచ్చి భయపెడుతున్నాయి. కళ్ళు తెరిస్తే సీలింగ్ ఫ్యాన్ రెక్కల మీద - గోడ మీద కూడా కూడా ప్లస్ లూ ఇంటూలు కనిపిస్తున్నాయి.

*(రచన మాస పత్రిక నవంబరు 1992)*